లోంచి బయటకి చూస్తే, జోరున కురిసే వర్షం వల్ల భిక్షకి కదలలేక నకనకలాడే కడుపుతో పడుకుని వున్న ఆ సన్యాసిని చూసి మళ్ళీ అనుకున్నాడు, 'పొరబడ్డాను. సన్యాసీ దుఃఖీ-సంసారి సుఖీ'.

నిజానికి రెండు సందర్భాల్లో సన్యాసి సుఖంగానే వున్నాడని గృహస్థుకి తెలీదు. సుఖానికీ, దుఃఖానికీ మన మనస్సే ఎలా కారణమో, అలా ఇతరులు సుఖంగా వున్నారు, లేదా దుఃఖంగా వున్నారు అనుకోడానికి కూడా మన మనస్సే కారణం.

## 84. మచ్చలేని బంగారం

ఓ ఆధ్యాత్మికవేత్త అడవిలోని ఓ చిన్న కుటీరంలో వుంటూ తపస్సు చేసుకోసాగాడు. క్రమంగా అతని గురించి విన్న ఆ దేశపు రాజు గూఢచారులని పంపి ఆయన గురించి వాకబు చేసారు. అత్యంత తక్కువ అవసరాలతో జీవించే ఆయన మహానుభావుడని రూఢి చేసుకున్నాక ఆ రాజు ఓ రోజు అడవిలోని ఆయన కుటీరానికి వెళ్ళాడు. ఆయన్ని సేవించి ఓ బంగారపు పళ్ళాన్ని తీసి ఆయనకి ఇచ్చి భక్తిగా చెప్పాడు.

"స్వామీ! దీన్ని మీరు దయతో తీసుకుని నిత్యం ఆహార స్వీకారానికి ఉపయోగించి నన్ను అనుగ్రహించండి."

"నేను మంచి బంగారమా? లేక ఈ కంచంలోని బంగారం మంచిదా?" ప్రశ్నించాడు ఆ ఆధ్యాత్మికవేత్త.

"నిస్సందేహంగా మీరే మచ్చ లేని మంచి బంగారం." తక్షణం జవాబు చెప్పాడు రాజు.

"అయితే ఇది నాకెందుకు? మీరే తీసుకెళ్ళండి."

ఆ బంగారు పళ్ళాన్ని ఆయన తిరస్కరించాడు. రాజుకి మచ్చ లేని మంచి బంగారం అంటే ఏమిటో అప్పుడు అర్థమైంది.